కార్ పూలింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి

● సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఐటీ కంపెనీల్లో ఉద్యోగులు కార్‌పూలింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి బయటపడటంలో దాని ప్రాముఖ్యత గురించి ఉద్యోగులకు తెలియజేయాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు. సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ), బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) కంపెనీ సీఈవోలతో సీపీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. సైబరాబాద్ పోలీస్‌తో కలిసి ఎస్సీఎస్సీ చేస్తున్న కార్యక్రమాలు, వాటి ద్వారా ఐటీ కంపెనీలకు జరుగుతున్న మేలు, సామాజిక బాధ్యతకు సంబంధించిన విషయాలు తెలియజేశారు. కంపెనీల్లో సమాచార భద్రతా నిపుణులు ఉంటే సీఐఎస్‌వో (చీఫ్ ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్)కు నామినేట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహనకు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చిన కంపెనీల సీఈవోలను సీపీ అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, బాలానగర్ డీసీపీ శ్రీనివాస్, ఎస్సీఎస్సీ జనరల్ సెక్రటరీ రమేష్ ఖాజా, ఇతర అధికారులు, బీఎఫ్ఎస్ఐ కంపెనీల సీఈవోలు, ఎస్సీఎస్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇనార్బిట్ మాల్‌లో క్రాస్‌వర్డ్ బుక్ ఫెయిర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుస్తక ప్రేమికులకు ఆనందానుభూతులను కలిగిస్తూ సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో నెలరోజుల పాటు క్రాస్‌వర్డ్ బుక్ ఫెయిర్‌ను నిర్వహిస్తోంది, మార్చి 9 వరకూ జరిగే ఈ ఫెయిర్‌లో నాన్‌ఫిక్షన్, ఫిక్షన్ ఇలా విభిన్న విభాగాల్లో బుక్స్ చదివే అవకాశం పొందడం మాత్రమే కాదు వారాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నారు. చిన్నారుల కోసం స్టోరీ టెల్లింగ్, యువత కోసం డూ ఇట్ యువర్ క్రాఫ్ట్ సెషన్లను నిర్వహిస్తున్నామని మాల్ ప్రతినిధిలు తెలిపారు. పిల్లల్లో పుస్తకాలపై ప్రేమను పెంచే రీతిలో ఈ కార్యక్రమాలను చేస్తున్నామన్నారు.

'ఉస్మానియా' రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీ వేయాలి

● ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రి రక్షణకు వారసత్వ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, జీవో 313ని అమలు చేయాలని ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి పరిరక్షణ గ్రూపు ప్రతినిధులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రిని పరిరక్షించాలని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రూపు ప్రతినిధులు అనురాధ రెడ్డి, డాక్టర్ జస్వీన్ జైరత్, సారా మాథ్యూస్, డాక్టర్ ఇక్బాల్ జావీద్, డాక్టర్ ఆసీఫ్ హనీఫ్ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న భవనానికి మరమ్మతులు చేపట్టి వైద్య సేవలు కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనాన్ని అలానే ఉంచి, ఖాళీగా ఉన్న ప్రదేశంలో అధునాతన వసతులతో కొత్త భవనం నిర్మించాలని వారు సూచించారు. ఈ సమావేశంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కార్లు అద్దెకు తీసుకొని తప్పించుకు తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

నిజాంపేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కార్లను అద్దెకు తీసుకెళ్లి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి మండలం, హొసూర్ గ్రామానికి చెందిన గోపాల్ రవి(46) 2022 - ఏప్రిల్ 27న విజ్ఞాన్ స్కూల్ నిజాంపేట్ సమీపంలోని యూనివర్సల్ కార్స్ ట్రావెల్స్ వద్దకు వెళ్లి సెల్ఫ్ డ్రైవ్ కోసం రెండు కార్లను కావాలని యూనివర్సల్ కార్ల నిర్వాహకుడు సయ్యద్ ఖాజా అబీబ్ అన్సారీని అడిగాడు. దీంతో అన్సారీ చెప్పిన విధంగా రూ. 1 లక్షా 40 వేలను చెల్లించి, ఇన్నో క్రిష్టా కారు(నెంబరు టీఎస్08ఎఫ్ ఎయూ9126)ను, ఎర్టిగా (టీఎస్08జీఆర్ 1648)ను రవి తీసుకెళ్లాడు. నెల రోజుల తరువాత 6-5-2022న అదే ట్రావెల్స్‌కు వచ్చి, మరో రూ. 40వేలు ట్రావెల్స్ నిర్వాహకుడికి చెల్లించి షిఫ్ట్ డిజైర్ (టీఎస్08జీడబ్ల్యూ 1006)కారును తీసుకెళ్లాడు. తర్వాత నుంచి అద్దె డబ్బుల కోసం రవికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. అనుమానం వచ్చిన యూనివర్సల్ కార్స్ ట్రావెల్స్ నిర్వాహకుడు తమిళనాడులోని హొసూర్ సిటీలో ఈ కార్లు తిరుగుతున్నట్లు కారు జీపీఎస్ ట్రాకర్ ద్వారా తెలిసింది. వెంటనే హొసూర్ సిటీకి వెళ్లిన ట్రావెల్స్ నిర్వాహకుడు అతడి కార్ల గురించి ఆరా తీశాడు. కార్లను తీసుకెళ్లిన రవి, వాటిని థర్డ్ పార్టీకి తనఖా పెట్టి బిజినెస్ నిమిత్తం డబ్బులు తీసుకున్నాడన్ని తెలిసింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందుతుడి కోసం గాలిస్తున్నాడు. ఎలాంటి సమాచారం లభించలేదు. ఈ విషయమై బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. సీఐ ఉపేందర్ ఛాలెంజ్‌గా తీసుకొని ఎస్ఐ రమేష్, కానిస్టేబుల్స్ యాదగిరి, రాజు తమిళనాడులోని హొసూర్ సిటీలో థర్డ్ పార్టీ దగ్గర ఉన్న ఎర్టిగా కారును గుర్తించి స్వాధీనం చేసుకొని నిందుతుడు రవిని కూడా అదుపులోకి తీసుకున్నారు. మిగతా వాటి కోసం గాలిస్తున్నట్టు సీఐ ఉపేందర్ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి ఒక కారును స్వాధీనం చేసుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించినట్టు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



పాపడ్ అంబాజీ

బాలానగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గాలేని వ్యక్తి అదృశ్యమయ్యారు. బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఫిరోజ్‌గూడ అయ్యప్ప ఆలయ సమీపంలో నివాసముండే పాపడ్ అంబాజీకి మానసిక స్థితి సరిగ్గా లేదు. కుటుంబ సభ్యులు అతడిని ఇంటి వద్దనే ఉంచి కాపు కాస్తున్నారు. ఈ నెల 9న మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి కోసం వెతికినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. దీంతో పెద్ద కుమారుడు గోవింద్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా గుర్తు పడితే బాలానగర్ పోలీసులకు 9490617114 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ కోరారు.

కారు ఢీకొని చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మృతి

● నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐకి గాయాలు

కొత్తపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాదిక్ అలీ(40) మృతి చెందగా, నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్(52)కు గాయాలయ్యాయి. ఎల్బీనగర్ ఎస్ఐ దయాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన మహ్మద్ సాదిక్‌అలీ మలక్‌పేట ఏ- బ్లాక్ క్వార్టర్స్‌లో ఉంటూ చార్మినార్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నారాయణగూడ ఎక్సైజ్ ఎస్ఐ ఖాజావలి మొయినుద్దీన్ కూడా ఏ- బ్లాక్‌లోనే ఉంటున్నారు. ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై ఎల్బీనగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి 11.40 గంటలకు తిరిగి బైకుపై మలక్‌పేటకు బయలుదేరారు. సరూర్‌నగర్ స్టేడియం వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న కారు వారి బైకును ఢీకొట్టింది. బైకు నడిపిన సాదిక్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి, వెనుక కూర్చున్న ఖాజావలీకి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సాదిక్‌అలీ, ఖాజావలీలను 108 వాహనంలో ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్నారు. సీఐ సాదిక్‌అలీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తెలిపారు. ఎస్ఐ ఖాజావలి చికిత్స పొందుతున్నారు. మృతుడి సోదరుడు ఎండీ అబ్దుల్ అలీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ పరారయ్యాడు.

రాత్రి అదృశ్యం.. ఉదయం నాలాలో మృతదేహం

● బాలుడి మృతిపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ఎం.కార్తిక్ (ఫైల్)

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు రాత్రి అదృశ్యమయ్యాడు. మరుసటి రోజు సమీపంలోని ఓ నాలాలో మృతదేహం లభించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నం. 5 దుర్గాభవానీనగర్ బస్తీలో మునావత్ కవిత, రమేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు ఎం.కార్తిక్(11) జవహర్‌నగర్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13న బస్తీలో పిల్లలతో కలిసి కార్తిక్ ఆడుకుంటూ రాత్రి 8 గంటల తరువాత కనిపించకుండా పోయాడు. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. బుధవారం ఉదయం బస్తీకి ఆనుకొని ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కులో నుంచి వెళుతున్న నాలాలో పరిశీలించగా కార్తిక్ మృతదేహం లభించింది. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణంలో భక్తులు



స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేస్తున్న అర్చకులు



స్వామివారి కల్యాణంలో కార్పొరేటర్ జగన్

హైదర్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ సెవెన్‌హిల్స్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి గరికపాటి నరసింహారావు భక్తులకు ప్రవచనాలు వినిపించారు. బుధవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, అర్చనానంతర సేవా, 10 గంటల నుంచి పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం తిరు విధుల్లో గరుడోత్సవం నిర్వహించారు.

జగద్గిరిగుట్టలో...

జీడిమెట్ల: జగద్గిరిగుట్ట లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తుల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. 53వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవానికి కార్పొరేటర్ కె.జగన్, ఆలయ కమిటీ చైర్మన్ వేణుయాదవ్ కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ జగన్ అలివేలు మంగమ్మ, పద్మావతి అమ్మవార్ల అలంకరణకు 1.5కిలోల వెండి ఆభరణాలు ఆలయ ఈవోకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణాగౌడ్, బండిసత్యనారాయణ, జైహింద్, లక్ష్మీ, శశికళ, జ్యోతి, శివాని, సాయి, కార్తీక్, కీర్తి పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి



గచ్చిబౌలి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల అపర్ణా గ్రాండే గృహ సముదాయంలో వసంత పంచమిని(సరస్వతి జన్మదినం) స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారు లకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ బెహరా, శ్రీనివాసరాజు, పాండే, బ్రహ్మానందం, మిలన్, నాయకుడు, ఎంసీ సభ్యులు అర్లప్, చేతనా, బట్టాచార్య ఉత్తమ బెహర పాల్గొన్నారు.

భెల్‌కాలనీ: భెల్ టౌన్‌షిప్‌లోని కనకదుర్గాదేవి ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో బుధవారం వసంత పంచమి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వందలాది మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మియాపూర్: వసంత పంచమి సందర్భంగా మియాపూర్ దీప్తి శ్రీనగర్‌లోని ధర్మపురిక్షేత్రంలో బుధవారం ఆలయ ట్రస్టీ గొట్టిపాటి సత్యవాణి ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతీదేవికి సుప్రభాతం, పంచామృత అభిషేకం, పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సాయంత్రం సహస్రనామార్చన, గ్రంథములను పల్లకీలో ఊరేగింపు, విద్యార్థులచే సామూహిక ప్రార్థనలు, పాడుతా తీయగా సీజన్ 20 చిన్నారులచే భక్తిగీతాల సంగీత విభావరి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



సరస్వతిదేవి పూజలో నల్లగండ్ల అపర్ణా గ్రాండే వాసులు



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సం



అమ్మవారి పూజల్లో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ ప్రణయ్

నిజాంపేట్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ 191 ఎన్‌టీఆర్ నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ ప్రణయ్ పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మంజునాథ్, అసోసియేషన్ అధ్యక్షులు పూర్ణ, 191 ఎన్‌టీఆర్ నగర్‌అధ్యక్షులు కృష్ణ, కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మైసమ్మతల్లి...

గచ్చిబౌలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ ఇందిరానగర్ శ్రీమైసమ్మతల్లి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన కట్టమైసమ్మ జాతర

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన కట్టమైసమ్మ జాతర బుధవారం అన్నదానం కార్యక్రమంతో ముగిసింది. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇన్‌కాయిస్ సేవలు ఉన్నతమైనవి: కిరణ్ రిజిజు



మాట్లాడుతున్న కేంద్ర భూశాస్త్ర మంత్రి కిరణ్ రిజిజు

నిజాంపేట్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సముద్ర సమాచారం అందించడంలో ఇన్‌కాయిస్ సేవలు ఎంతో ఉన్నతమైనవని కేంద్ర భూశాస్త్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలోని ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన ఇన్‌కాయిస్ 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించారు. సముద్రంలోని నిక్షేపాలను గుర్తించడం, ప్రకృతి వైపరిత్యాలు సంభవించే సమయంలో ముందుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడం, సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంలో ఇన్‌కాయిస్ ముందుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలందించడానికి ఇన్‌కాయిస్ కృషి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాసకుమార్,డాక్టర్ ఎం.రవిచంద్రన్ కార్యదర్శి పాల్గొన్నారు.

వేగం కాదు.. ప్రాణం ముఖ్యం: డీటీఓ కిషన్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వేగం కన్నా ప్రాణం మిన్న అని గుర్తుంచుకొని వాహనాలు నడపాలని మేడ్చల్ డీటీఓ కిషన్ అన్నారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయంలో డ్రైవర్లకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగం, ర్యాష్ డ్రైవింగ్ మంచిది కాదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ప్రతి ఒక్కరూ తమ గమ్య స్థానాలకు చేరుకునేలా డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇనిస్పెక్టర్స్ ఎస్వీఎన్ ప్రతాప్ రాజు, జి. రవికుమార్, జి. మహేష్, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

గాజులరామారం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గాజులరామారం ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని సీపీఐ నాయకులు రాష్ట్ర సచివాలయం మున్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలోని సర్వే నెంబర్ 326, 329, 307, 342లో కబ్జాదారులు అక్రమంగా నిర్మించిన 2500 ఇళ్ల నిర్మాణాలను కూల్చి వేయాలని మే 13న ఉన్నతాధికారులు రెవెన్యూ అధికారులను ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సామాన్య ప్రజలను మోసం లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లా పూర్ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

తాండ్రకుమార్‌కు నివాళి



తాండ్రకుమార్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

మియాపూర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకుడు తాండ్రకుమార్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం మియాపూర్ క్రాస్‌రోడ్డులోని స్మారక స్థూపం వద్ద నాయకులు, అభిమానులతో కలిసి ఎంసీపీఐ(యూ) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మద్దికాయాల అశోక్ ఓంకార్ నివాళులర్పించారు. అనంతరం మియాపూర్ నుంచి ఎంఏనగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్, కేంద్ర కమిటీ సభ్యులు నాగరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, వసుఉల మట్టయ్య, గోని కుమారస్వామి, రమేష్, రవి, మల్లేశ్, అనిల్ కుమార్, భాగ్యమ్మ, కళావతి పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

ఫతేనగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రం మొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం మూసాపేట్ పేట్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సంజీవయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కర్క.నాగరాజు, సీనియర్ మహిళా నాయకురాలు శారదారెడ్డి, అంబేడ్కర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కర్కడాకయ్య, కర్కరవీందర్, బీసీ నాయకులు, బాశెట్టి నర్సింగ్‌రావు, జెల్లరాము, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిఖిల్, శ్రీనివాస్, చిన్న సాయి, సదామహేశ్, పెరుమాండ్ల నర్సింగ్, ఖాన్, బాష పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

● పోలీసుల అదుపులో నిందితుడు



పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లోని శివాలయంలోకి చోరీ చేసేందుకు బుధవారం మధ్యాహ్నం ఓ యువకుడు ప్రహరీ దూకాడు. గమనించిన స్థానికులు, ఆలయ పూజారి యువకుడిని పట్టుకొని పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు స్థానికులు తెలిపారు.

గిరిజన ఉద్యోగులను చులకన చేయొద్దు

● జేఎన్‌టీయూ వీసీతో గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



వీసీ కట్టా నర్సింహారెడ్డిని కలిసిన అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో గిరిజన ఉద్యోగులు, అధికారుల పట్ల కొందరు ఉన్నతాధికారులు వేధింపులకు పాల్పడుతున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని, గిరిజన ఉద్యోగులను చులకన చేయకుండా.. రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను కాపాడాలని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డికి అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. గిరిజన వర్గాలకు చెందిన ఆచార్యులపై కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తే, కనీసం షోకాజ్ నోటీసు ఇవ్వకుండా.. ఏకంగా చార్జిమెమో జారీ చేయడమేంటని గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు వీసీని ప్రశ్నించారు. చార్జ్ మెమోకు సంజాయిషీ ఇచ్చేందుకు గడువు ఇవ్వమని కోరినా, వర్సిటీ రిజిస్ట్రార్ ససేమిరా చెప్పడమంటే.. వారి హక్కులను కాలరాయడమేనని స్పష్టం చేశారు. గిరిజన హక్కులపై ఉద్యోగులను, అధికారులను చైతన్య పరిచేందుకై త్వరలో 'సేవ్ కాన్స్టిట్యూషన్.. సేవ్ డెమోక్రసీ' నినాదంతో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. వీసీని కలిసిన వారిలో అఖిల భారత ఎస్సీ, ఎస్టీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కె.మహేశ్వర్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రామచంద్రరావు, శేషాద్రి, శ్రీనివాస్, సాంబశివరావు, బి.నాగార్జున, ఎం.రాధా, జేఎన్‌టీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ప్రతినిధులు మాధవీకుమారి, వసుమతి తదితరులున్నారు.

జూబ్లీహిల్స్ హత్య కేసులో.. పోలీసు అదుపులో రౌడీషీటర్ జిలాని

బంజారాహిల్స్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రియాల్టర్, బీజేపీ నాయకుడు సింగోడి రాము హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన రౌడీషీటర్ జిలానీని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. రాముపై పగతో మణికంఠ హత్య చేసేందుకు పథకం వేయగా రౌడీషీటర్ జిలానీ తన మనుషులతో పాల్గొన్నాడు. హత్య అనంతరం జిలాని అక్కడి నుంచి పారిపోయాడు. అతని మనుషులు మాత్రం పోలీసులకు దొరికారు. గతంలో కూడా అనేక హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న జిలానీని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ హత్యలో ఏ8గా ఉన్న జీడిమెట్లకు చెందిన గణపతిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గీతాంజలి స్కూల్ స్పోర్ట్స్ మీట్



స్పోర్ట్స్‌మీట్‌లో హీరో సుమన్

గచ్చిబౌలి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గీతాంజలి హైస్కూల్ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీహీరో సుమన్ ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కేవలం చదువులకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే రోజుల్లో విద్యార్థులకు ఆటలపట్ల శ్రద్ధ వహిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న గీతాంజలి యాజమాన్యాన్ని సుమన్ అభినందించారు. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ రెష్మ టకూన్, ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓల్డ్‌బోయినపల్లి డివిజన్ ఓబీసీ చైర్మన్‌గా శ్రీరాములు

ఓల్డ్‌బోయినపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌బోయినపల్లి డివిజన్ ఓబీసీ చైర్మన్‌గా ఏర్వ శ్రీరాములు నియమితులయ్యారు. నేషనల్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ చెర్మన్ కాప్టెన్ అజయ్ సింగ్ యాదవ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆదేశాల మేరకు మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ గువ్వ రవిముదిరాజ్ బుధవారం గాంధీభవన్‌లో శ్రీరాములుకు నియామక పత్రం అందజేశారు.

గాజులరామారంలో ఉప కమిషనర్ పర్యటన

గాజులరామారం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గాజులరామరం డివిజన్‌లో గాజులరామరం ఉప కమిషనర్ మల్లారెడ్డి పర్యటించారు. అనంతరం లెనిన్‌నగర్, అంబేడ్కర్‌నగర్, శ్రీరామ్ నగర్‌ల్లో బస్తీ వాసులను స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, ప్రసాద్, శ్రీనివాసరావు, గఫర్, రాజిరెడ్డి, బాల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రహీమ్ పాల్గొన్నారు.

గాజులరామారం సర్కిల్ ఏఎంసీగా నర్సింగరావు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ నూతన సహా మున్సిపల్ కమిషనర్(ఏఎంసీ)గా ఎ. నర్సింగరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సరూర్‌నగర్ సర్కిల్ ఏఎంసీగా విధులు నిర్వహించి గాజులరామారం సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. గాజులరామారం సర్కిల్ ఏఎంసీగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు సరూర్‌నగర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. రెవెన్యూ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది ఏఎంసీ శ్రీనివాస్‌రావును సన్మానించి సాధరంగా సాగనంపారు.

● పాతుకుపోయినవారికి స్థానచలనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో ఎన్నోఏళ్లుగా పాతుకుపోయిన డిప్యూటీ కమిషనర్లకు స్థాన చలనం కలిగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీలు చేయగా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఒకే స్థానంలో ఏళ్లతరబడి ఉన్న పది మందిని బదిలీ చేశారు. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని నియమించారు. ఏశైలజ, ఎండీ షేక్, డి.సుభాష్ రావులకు పోస్టింగ్ ఇవ్వలేదు.

జీహెచ్‌ఎంసీలో కదిలిన కుర్చీలు

పేరు	ప్రస్తుతం పని చేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
జకీయ సుల్తానా	డిప్యూటీ సీఈఓ	సర్కిల్-4, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్
ఎ.సుజాత	సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్
సీహెచ్.నాగేశ్వరరావు	రామగుండం, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-12, మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్
జి.వేణుగోపాల్ రెడ్డి	బోడుప్పల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-29, సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్
శివకుమార్	డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్, జీహెచ్‌ఎంసీ	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్
ఎస్.విద్యాధర్	గజ్వేల్, మున్సిపల్ కమిషనర్	సర్కిల్-14, గోషామహల్ డిప్యూటీ కమిషనర్
వి.సమ్మయ్య	తెల్లాపూర్, డిప్యూటీ కమిషనర్	సర్కిల్-30, బేగంపేట డిప్యూటీ కమిషనర్
ఖాదర్ మొయినుద్దీన్	వెయిటింగ్	సర్కిల్-15, ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్
తిప్పర్తి యాదయ్య	ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్
జి.ఆంజనేయులు	డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ	సర్కిల్-2, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్
టి.దశరథ	సర్కిల్-4, ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
పి.రవీందర్‌కుమార్	సర్కిల్-3, హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
సీహెచ్.అరుణకుమారి	సర్కిల్-5, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్
ఎ.నాగమణి	సర్కిల్-7, సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు అటాచ్